జగమెరుగని త్యాగి

శ్రీమతి వేదుల మీనాక్షీదేవి

★ ★

అస్తమిస్తున్న సూర్యుడు ఆకాశంనుంచి చేతులు చాచి సముద్రాన్నేదో యాచిస్తున్నట్లుగా కనబడ్డాడు. ఏమీవినిపించుకోని హోరుతో తన వెనుకవున్న సూర్యుణ్ణి గమనించకుండా బీచివొడ్డున కూర్చున్న జనంవైపు కెరటాల్ని చాపుతున్నాడు సముద్రుడు.

ఆఫీసునుండివస్తూ మెరీనా హోటల్లో టీ త్రాగి, బీచివొడ్డున యిసుకలో కూర్చున్నారు రావు, వర్మ. వాళ్ల పక్కనే ఆ నాడు హెడ్‌గుమస్తాకూడావచ్చి కూర్చున్నాడు. ఇంతట్లో "చూడు రామనాథం! ఓ బేడ ఇయ్యి నాయనా" అంటూ రంగయ్యతాత వచ్చాడు. రామనాథం "కి"మ్మనకుండా జేబులోంచి బేడతీసి చేతిలో పెట్టాడు.

హెడ్‌గుమస్తా రామనాథం మహాఘటికుడు. కనికరం అన్నది యేకోశాన లేదు. గుమాస్తాలచేత చచ్చే పని చేయిస్తూంటాడు ఒక్క పావుగంట విశ్రాంతిగా వుండడం కిట్టదు. దానగుణంకూడా తక్కువే. కాకికి యెంగిలిచెయ్యి విదపడు అని ప్రతీతి. అలాంటి రామనాథం మాట్లాడకుండా బేడతీసి యివ్వడం చూస్తే రావుకీ, వర్మకీ చిత్రంగావుంది. "రామనాథంగారూ! ఆ వచ్చిన ఆయన పేరేమిటి?" రావు సంగతి కనుక్కుందామన్న ఆలోచనతో అన్నాడు. "పేరు రంగయ్య. అంతా రంగయ్యతాత అంటారు. మా వూళ్ళో పిల్లా పెద్దా అంతా అదే పిలుపు. అదివిని మమ్మల్నెరిగున్న వాళ్ళుకూడా ఆ విధంగానే పిలుస్తారు" అని రామనాథం అంటూండగా మధ్యలో వర్మ "ఏమండీ! ఆయన వెళ్ళిపోతుంటే మీ కళ్లలో నీళ్లు తిరిగాయేం?" అన్నాడు.

"ఇల్లాగ అతను వచ్చినప్పుడల్లా రంగయ్యతాత బ్రతుకాఖరికిల్లా అయిందికదా అని దుఃఖమొస్తుంది" రామనాథం అన్నాడు విన్నబోయిన ముఖంతో. "ఏం? మొదటనుండి యీ యాచనావృత్తిలేదా?" అడిగాడు రావు.

"ఈ మధ్యనే ఆయన నెలలనుండి ప్రారంభించాడు. ఆస్తిపోయింది ఆఖరికాలానికి" నిట్టూర్చాడు రామనాథం.

"పేకాటాగట్రా ఆడి తగలేసి వుంటాడు" రావు కాళ్లు ఆడిస్తూ అన్నాడు.

"అదైతే అంత అనుకోనక్కర్లేదతన్ని గురించి. కాని, ఇతనలాంటిదేమీ చెయ్యలేదు. ఇతని డబ్బు సద్వినియోగమే జరిగింది" రామనాథం అన్నాడు.

"అయితే మీరీయన్నెక్కడ యెరుగుదురు? నేనెప్పుడూ యీ వూళ్ళో యీయన్ని చూడలేదు." వర్మ అడిగాడు.

"రంగయ్యతాతదీ నాదీ ఒకవూరే. నేనేకాదు నా వయస్సులోవున్న మా వూరి వాళ్ళంతా ఆయన వద్దికలో పెరిగినవాళ్ళమే. మాకు మంచి మంచి విషయాలు చెప్పేవాడు. కష్టపడి పనిచేయాలనీ, సోమరిగా వుండకూడదనీ బోధిస్తూండేవాడు. ఆయన ఇంకా యింకా యెన్నో నీతులు నేర్పాడు. అవన్నీ మా జీవితాల్ని తీర్చిదిద్దాయి. ఈ వూళ్ళో వాళ్ళ మేనమామలుండేవారు. చిన్నతనంలో ఆయన తరుచు వస్తూండేవాడు. ఇప్పుడు వాళ్ళు లేకపోయినా యీ వూరంటే ఆయనకు అభిమానం. అందుచేత ఎప్పుడైనావచ్చి ఒక రోజో రెండు రోజులో వుండి వెడుతూంటాడు" అన్నాడు రామనాథం.

"అయితే యీయన మీకు బంధువా?" వర్మ అడిగాడు.

"బంధువుకాదు కాని అంతకన్న యెక్కువే. మా వూరివారంతా రంగయ్యతాతనొక దేవతామూర్తిలాగ చూచుకుంటారు."

"అంతటి మహాత్మ్యంవుందేమిటి?" రావు అడిగాడు. వర్మ మరికొంచెం దగ్గిరగా జరిగాడు రామనాధానికి.

"మా రంగయ్యతాతను గురించి చెప్పడానికి యెంతైనావుంది. రంగయ్యతాతకి మహత్యంలేదు. మంత్రంలేదు. కాని అతనొక దేశసేవకుడు. దేశప్రజలంతా చెప్పుకునే దేశసేవకులలో యీ పేరు మీరు వినివుండకపోవడంవల్ల మీరు నమ్మకపోవచ్చు. నవ్వవచ్చు. కారణం? — అతను యెన్నడూ జైలుకి వెళ్ళలేదు. సత్యాగ్రహాలు చెయ్యలేదు. ఆఖరికి కాంగ్రెసులో పావలా మెంబరుకూడా కాదు. అలాగని అతను దేశభక్తుడు కాడనగలమా? అతని సంగతి తెలిసినవారు, అతన్నెరిగివున్నవారు అంగీకరిస్తారు.

బాగా వెండిలాంటి గడ్డంతో, శిరోజాలతో, ముసిలి ముద్దగా యిప్పుడు కనబడుతున్నాడు కనుక మీకు రంగయ్యతాత అన్నా విడ్డూరంగా లేదుకదూ? కాని యీ పిలుపు అతని నలభైయవయేటే వచ్చింది. పిల్లలు "తాతా" అంటే పెద్దలుకూడా అదే పిలుపు ప్రారంభించారు. అదే అందరికీ అలవాటయింది.

అజానుబాహువైన విగ్రహం. పదహారువన్నె బంగారం ఛాయ. విశాలమైన ఫాలభాగానికి మధ్యగా సన్నని నిలువుబొట్టు యెర్రగా వుండేది. ప్రసన్న వదనము. ఆయన్నిచూస్తే సాక్షాత్తూ ఆ శ్రీరామచంద్రమూర్తిని చూసినట్లు మనస్సుకి తృప్తికలిగేది చూసినవాళ్లకి. ఆ నాటి రంగయ్యతాత విగ్రహం కళ్ళకు కట్టినట్లు కనబడుతుంది యిప్పుడుకూడ.

మనస్సు మెత్తన. మాటమెత్తన. ఆబాల గోపాలాన్ని తన ఆప్యాయమైన మాటలతో తన వాళ్ళని చేసుకుంటాడు. అతనిలో వొక మహత్తరమైన శక్తివుంది. మా వూరివాళ్ళకి రంగయ్యతాత అంటే చెప్పలేని అభిమానం" అంటూ రామనాధం రంగయ్యతాత చరిత్ర చెప్పడానికి ఉపోద్ఘాతం ప్రారంభించాడు.

"ఈయన కుటుంబం యెక్కడవుంది?" అడిగాడు రావు.

"రంగయ్యతాతకి ముప్పయ్యవయేట భార్య కాలంచేసింది. సంతానంలేదు. ఆయనకామాటే లేదు. ప్రజలే ఆయన సంతానం, ప్రపంచమంతా ఒక కుటుంబంగా యెంచుకుంటాడు" అన్నాడు రామనాధం.

"అయితే రామనాధంగారూ! కుటుంబం లేకపోయినా ఆస్తియెలా క్షీణించిందండీ" అన్న వర్మ మాటలకు సమాధానంగా రామనాధం "ఆయనకి వసుధే కుటుంబం అన్నానుకదుటోయ్. ప్రజలకే తనసొమ్ము వినియోగించాడు. తిండిలేనివాళ్ళకి తిండిపెట్టాడు. బట్టలేదన్నవాడికి బట్ట యిచ్చాడు. చదువుకోలేనివాడికి జీతం కట్టాడు. నూతులు లేనిచోట్ల నూతులు తవ్వించాడు. రాట్నాలు తెప్పించి అందరిచేత నూలు తీయించేవాడు. తనకున్న ఆఖరు పైసకూడా ఖర్చైపోయినా ఆయనకు విచారంలేకపోయింది. తన సొమ్ము సద్వినియోగం అయిందని అతనికి తృప్తి.

మన జీవితమంతా ఆదర్శంగా, మానవాభ్యుదయానికి తద్వారా దేశాభ్యుదయానికి తోడుపడేటట్లుండాలని రంగయ్యతాత పదేపదే చెబుతూంటాడు. చెప్పడమేకాదు. ఆ ప్రకారం చేసేవాడు.

మాటలు చెప్పడం సులువే. ఆచరణ సాధ్యం కాదు. అందుకే రంగయ్యతాత అంటే ఆ వూరివారికేకాదు—అచుట్టుపట్ల గ్రామాల వారందరికీకూడా యెంతో గౌరవం; భక్తీను. అంతా ఆయనలాగే వుండామని ఆయన్ననుకరించేవాళ్ళం. కుల, మత, వర్గభేదాలులేవా ప్రాంతాల్లో.

"చిన్నప్పటినుండి రంగయ్యతాతకు కాంగ్రెసుసంస్థ అన్నా, కాంగ్రెసు నాయకులన్నా అభిమానంగా

వుండి క్రమంగా ఆ మనలో జీర్ణించిపోయింది. తన గదిలో స్వర్గీయనాయకుల ఫోటోలు గోడలపై అలంకరించాడు. ఆ పటాలకు రోజూ రకరకాల పూలమాలలు వేసి వారి వర్ధంతులు జరిపేవాడు. ఇవన్నీ మామూలు విషయాలు. మా రంగయ్యతాత చేసిన గొప్ప పనులెన్నో వున్నాయి” అన్నాడు.

“మీ రంగయ్యతాతగారంటే మాకూ అభిమానం కలుగుతోంది. ఆ గొప్ప పనులు వినాలనివుంది చెప్పండి” అన్నాడు రావు.

“అన్నీ చెప్పడం ప్రారంభిస్తే యేళ్ళు పట్టవచ్చు. కొన్ని మాత్రం చెబుతాను. రంగయ్యతాత యింటికి రెండు యిళ్ళకి అవతలవున్న శేషగిరిరావుగారి మూడేళ్ళ అబ్బాయికి మశూచి వచ్చింది. అంటు వ్యాధి అవడంవల్ల యెవ్వరూ తొంగిచూసేవారు కారు. ఒక వంక బిడ్డకు భయంకరవ్యాధి, వేరొక వంక నిస్సహాయతవల్ల ఆ దంపతులు బెంగటిల్లిపోయారు. రంగయ్యతాతకా సంగతి తెలిసింది. పరుగున వాళ్ళింటికి వెళ్ళాడు. “ఏమిటితల్లీ ఎలా వున్నాడు అబ్బాయి” అంటూ పలకరించేసరికి వాళ్ళ ప్రాణాలు కుదుటబడ్డాయి. రెండు రోజులకా బిడ్డ చనిపోయాడు. ఇరుగు పొరుగువారు ఆ వ్యాధికి వెరచి కిటికీల దగ్గరనుండి చేసుకుని లోపల కూర్చున్నారు. శోకిస్తున్న ఆ దంపతులవద్ద యెవ్వరూ లేరు రంగయ్యతాత తప్ప. ఆ దంపతులు చిన్నవాళ్లు. కాగా అట్టి సమయాల్లో యెవరైనా పూనుకోవాలిగాని స్వయంగా అసలు వారేమీ చేయలేరుకదా? రంగయ్యతాత వాళ్లకి పెద్ద దిక్కుగావుండి యెంతో సహాయకారిగా వున్నాడు. “ఎందుకు వెడతావు? చూస్తూ చూస్తూ అగ్ని గుండంలో దూకుతారా?” అని వూళ్ళోవాళ్లడిగితే “మరేం ఫరవాలేదు. యోగంవుంటేగాని యేదీరాదు. ఇవ్వాళ వాళ్లకి వచ్చింది అవసరం; రేపు నాకు రావచ్చు. ఏమి చెప్పగలం యేనాటికేమివస్తుందో? అలాంటి చోట్లకు వెళ్లకూడదనడంకన్న ఆ వ్యాధిరాకుండా మన యిళ్ళు వాకిళ్లు శుభ్రంగా వుంచుకుని, అనారోగ్యమైన వస్తువులు తినకుండా ఆరోగ్యం కాపాడుకోవాలి అని జవాబిచ్చేవాడు. ఈ సంగతి జరిగి సుమారు యిరవై సంవత్సరాలయింది. ఆ దంపతులెక్కడో దూరాన వున్నారు. అయినా రంగయ్యతాతను మరచిపోలేదిప్పటికీ. వారు ఇప్పటికీ వుత్తరాలు వ్రాస్తూనే వుంటారు” రామనాథం చెప్పడం ఆపాడు.

“ఎంత ఆరోగ్యం బాగా చూసుకున్నా అలాంటి భయంకర వ్యాధుల దగ్గరకు వెళ్లలేము బాబూ! అసలు ఆ జబ్బువచ్చినవారిని చూడలేముకూడా” అన్నాడు రావు.

“ఒకమారేమైందనుకున్నారు రావుగారూ! మా వీధిలో ఒక చిన్నపిల్లకు వంట్లో బాగాలేదని వాళ్ల నాన్న నన్ను తీసుకొని వెళ్ళాడు. ఏ జ్వరమో తలనొప్పో అనుకున్నాను. తీరా వెళ్లి చూద్దునుకదా అమ్మవారు సంబంధం. ఇంటికి వచ్చాక జ్వరంవచ్చి ఆరులంఖణాలు చేశాను. మా నాన్న, అమ్మ హడలిపోయారు. దిక్కుమాలిన రోగం పగవాళ్ళకైనా వద్దుబాబూ” అంటూ బాధగా అన్నాడు వర్మ.

“ప్రజలకోసం తన ప్రాణాలనైనా అర్పించడానికి ఎప్పుడూ సిద్ధంగా వుంటాడు. ఎలాంటి రోగులకైనా సేవచేస్తాడు. ఈయనకు శత్రువులూ, మిత్రులూ సమానమే” అన్నాడు రామనాథం.

రామనాథం మాటలకి అడ్డువచ్చి “అంతా సమానమే అంటే అంతా శత్రువులా? మిత్రులా?” అన్నాడు రావు.

రామనాథం నవ్వుతూ “అంతా మిత్రులేనోయ్. ఒకమారు జరిగిన సంగతి చెబుతాను. అదివింటే నీకే తెలుస్తుంది అతని తత్వం” అంటూ చెప్పడం ప్రారంభించాడు. “అది 1942-వ సంవత్సరం. భారతమాత పరదాస్యంలోనేవుంది యింకా. ఆ తల్లికి విముక్తి కలిగించడానికి ప్రజోద్యమం తీవ్రరూపం దాల్చింది. భారతీయులు “క్విట్ ఇండియా” నినాదాలు చేస్తూ తమ దేశంతో అవతల దేశాలకు సంబంధంలేకుండా చేయడానికై రైలుపట్టాలు పీకేస్తున్నారు. టెలి

గ్రాఫ్, టెలిఫోన్ తీగలు తెంపుతున్నారు. రైలు స్టేషన్లు తగలబెడుతున్నారు. ఆఫీసు రికార్డులను నాశనం చేస్తున్నారు. బ్రిటిష్‌వారు దేశనాయకులను బంధించి యెక్కడ వున్నదీ తెలియనీయడం లేదు. ప్రజల్ని క్రూరంగా శిక్షిస్తున్నారు. తుపాకులతో భారతీయుల్ని కాల్చి చంపుతున్నారు.

సాయంత్రం అయిదు గంటలవేళ రంగయ్యతాత మా వూరికి మైలున్నర దూరానవున్న రైలుపట్టాల వైపు షికారుగా వెళ్ళాడు. ఆ సమయానికి పది పదిహేనుగురు చిన్నపిల్లలు అంతా పదిపన్నెండేళ్ల వాళ్లు పట్టాల దగ్గిర నిలబడివున్నారు. వారికి దగ్గర లాఠీ ఒక దొర తుపాకీ చేత్తోపట్టుకొని వున్నాడు. పిల్లలు పట్టాలు పీకడానికి ప్రయత్నించుతుంటే ఆ దొర కొడతానని బెదిరించాడు. అందరూ వెనక్కి తగ్గారు ఒక్క రాజా తప్ప. రాజాకి తుపాకీ చూపించి దొర పేల్చేస్తానని బెదిరిస్తున్నాడు. "ఎలా పేలుస్తావో పేల్చు" అంటూ చొక్కా గుండీలు తీసి గుండె చూపిస్తూ మీది మీదికి వెడుతున్నాడు ఆవేశంతో. "కాసుకో" అంటూ తుపాకీ యెత్తబోతున్నాడు దొర. అది దూరాన్నుండి చూస్తున్న రంగయ్యతాత ఒక్క అంగలో వారిద్దరి మధ్యకి వెళ్ళాడు.

రాజా ఆ వూళ్లో గొప్ప వర్తకుడైన సుబ్బయ్య షావుకారు ఏకైక పుత్రుడు. సుబ్బయ్యకు రంగయ్యతాత అంటే కోపం. న్యాయం, ధర్మం అంటూ అందరికి బోధిస్తూంటాడనీ, అట్టే లాభాలు తీసుకుని ప్రజల్ని పీడించడం వారి రక్తం తాగడమేనని తన కెన్నిమార్లో చెప్పాడు. చెప్పడమేకాదు బలవంత పెట్టాడనీ సుబ్బయ్యకు కోపం. సుబ్బయ్య బ్లాక్ మార్కెట్టు ప్రారంభించినట్లు రంగయ్యతాతకి తెలుసు. ఎప్పటికైనా తన గుట్టు బట్టబయలు చేస్తాడేమో. ఊరంతా రంగయ్యతాత పక్షం అవడంవల్ల అతడెల్లా చెబితే అలా చేస్తారు. ఎవ్వరూ తన దగ్గర వస్తువులు కొనకుండావుండే ఒకానొక రోజు తప్పక రాగలదు. అప్పుడు తన దుకాణంయేంగాను? ఇలాంటి భావాలతో సుబ్బయ్య రంగయ్యతాతపై కచ్చకట్టి మాట్లాడ్డం మానేశాడు. ఈ సంగతి రంగయ్యతాతకు తెలియకపోలేదు. "పిరికివాడు" అనుకుని నవ్వుకున్నాడు.

రాజా గుండెకి గురిపెట్టిన దొర తుపాకికి తన గుండె యెదురుగా పెట్టి "చూడు - నోరెరుగని పసివారికమీద నా ప్రతాపం? ఒక చెంపకొడితే పాలు, మరొక చెంపకొడితే నీరుకారే యీ చిన్నబిడ్డని కొట్టడానికి తయారవుతున్న నువ్వు యెంత దుర్మార్గుడివో, నీ అంతరాత్మ యెంత క్రూరమైందో తెలుస్తోంది. ఇలాంటి బిడ్డలు నీకు లేరూ? నాది బ్రిటన్. నేను బ్రిటిష్‌వాణ్ణి అని నువ్వు సగర్వంగా చెప్పుకుంటున్నావే! అలాగే మాది భారతదేశం. మేము భారతీయులం అనుకుంటే యేంతప్పు? నీ సేవగా ధర్మం నువ్వు చేస్తున్నాననుకుంటున్నావు, నీ ప్రభువు బ్రిటిష్ ప్రభువు అనుకుంటున్నావుకదూ? అదెప్పటికీకాదు. ఇంతమంది ప్రభువులులేరు నీకు, నాకు, యీ చిన్న బిడ్డలకే మాత్రమే కాదు; ప్రపంచంలోని జీవులన్నింటికి ఒకే ప్రభువు ఆపైని వున్నాడు. మనం చేసే పాప పుణ్యాలను చూస్తూనే వుంటాడు. నీకు తగిన శిక్ష చేస్తాడు. ఊరివారి బిడ్డను రాజుగారిబిడ్డ దండిస్తే రాజుగారి బిడ్డను దేముడు దండించుతాడు. ఈ నాడు యీ పసికూనను నువ్వు చంపితే రేపు నీ బిడ్డను భగవంతుడు తీసుకుపోతాడు. అది తెలుసుకో. నీ తుపాకీ వూరికే వుండనక్కర్లేదు. ఈ బిడ్డకు బదులు నన్ను చంపు. సంతోషంగా మృత్యువు నెదుర్కొంటాను" అంటూ ప్రశాంతంగా నిలబడ్డాడు రంగయ్యతాత.

అప్పటికి వూళ్లోజనం చాలామంది చేరారు. వారందరికీ ముందుగా సుబ్బయ్య షావుకారు నిలబడివున్నాడు. అందరినీ చురచురచూసి చక్కాపోయాడు దొర. రంగయ్యతాతమీద పూర్వపు శత్రుత్వం యింకా సాధించాలో, తనకు పుత్రభిక్ష పెట్టినందుకు కృతజ్ఞతగా వుండాలో నిర్ధారణచెయ్యలేకపోతున్నాడు సుబ్బయ్య. రాజాని గుండెలుకి హత్తుకొని రంగయ్యతాతకేసి వెర్రివాడిలాగ చూస్తూ వుండిపోయాడు."

"తన కన్న కొడుకు ప్రాణాలకు ప్రాణం అడ్డు వెయ్యడానికి సిద్ధపడిన రంగయ్యతాత విషయంలో ఏమీనిర్ధారణ చెయ్యలేకపోవడమే! నిజంగా ఆ సెట్టి నరపశువుకాకపోతే వెంటనే ఆ మహానుభావుని కాళ్లమీదపడరూ?" అన్నాడు రావు.

రావు ముఖం యెర్రబడిపోయింది కోపంతో. "ఆ విశ్వాస ఘాతకుడు కనబడితే యీ పిడికిలితో ఒక్కపోటు పొడుద్దును" అంటూ పిడికిలిబిగిస్తూ అన్నాడు వర్మ.

"ఇది యీ నాటి మాటకాదు. పన్నెండేళ్ల నాటి మాట. ఆ షావుకారు కాళ్ళమీద పడలేదుగాని వెర్రివాడిలాగచూస్తూ కళ్ళనీళ్లు కార్చాడు. ఆ సమయంలో మీలాగే అక్కడజేరినవాళ్ళకే కోపం వచ్చిందికాని సుబ్బయ్య కన్నీళ్లు చూశాక వెనక్కితగ్గారు.

ఆ ప్రాంతాలలోనే మన ఆఫీసుకి వచ్చాడు రంగయ్యతాత. వచ్చి "రామనాథం, మనదేశం స్వతంత్రం పొందాలి. నువ్వు పరప్రభుత్వానికి దాసోహ మనక్కరలేదు. ఆ రికార్డులు యిలా పారెయ్యి. నువ్వివ్వకపోతే ఆఫీసుకి నిప్పుపెట్టేట్లున్నారు ప్రజలు" అన్నాడు. ఏంచెయ్యడానికి తోచక నేను చూస్తూంటే రికార్డులు పట్టుకొని చల్లగా చక్కా బోయాడు. ఏపనిచేసినా యెవరి కళ్ళాపడకుండ చేయడమేగాని పదిమందిలో అల్లరి పొగడ్త కిట్టదు. మహాత్ముని బోధలను ఆ శ్రీకృష్ణ భగవానుని వచనాలుగా స్వీకరించేవాడు. అవే ఆయన పారాయణ చేసుకొనేవాడు. వాటిని ఆచరణలో పెట్టేవాడు.

ఓ నాడు రంగయ్యతాత వెక్కి వెక్కి యేడుస్తూండడం కొందరు పిల్లలు చూశారు. ఆ సంగతి క్షణంలో వూరంతా తెలిసింది. అంతా వచ్చారు. నవ్వుతూ కలకలలాడుతూ యెప్పుడూవుండేతాతి ముఖాన్ని విన్నదనంచూడలేకపోయారు. "ఏంతాతా అలా దుఃఖిస్తున్నావ్?" అని అడిగారు. "నాయనా, మహాత్ముడు చంపబడ్డాడు" అని మరీ దుఃఖించసాగాడు.

మహాత్ముని నిర్యాణవార్త ఆ సేతుహిమాలయం వరకేకాదు తృటిలో దేశదేశాలు తెలిసింది. అందరిలాగ ఆ వూరిజనం "అయ్యో మహాత్ముడుపోయాడే" అని బాధపడ్డారు. కాని, రంగయ్యతాత దుఃఖపడ్డం చూడలేకపోతున్నారు.

"తాతా, నువ్వు సుఖదుఃఖాలకు అతీతుడవు. అన్నీ సమానమే నీకు. అందరూ సమానమే. నీ భార్యపోయినప్పుడు నీ చిత్తస్థైర్యం మేము తెలుసుకున్నాం. ప్రవాహ వేగంలో ఒక కెరటంవచ్చి రెండు కర్రల నొకచోట చేర్చింది. మరొక కెరటం వచ్చి వేరుచేసింది. కాలప్రవాహాని కెవరు యెదురీదగలరని చెప్పిన నీ వంటి యోగికి దుఃఖమేమిటి?" అన్నారు అతిదీనంగా.

"నాయనా, నేను చెప్పింది స్వవిషయంలో మాట. బాపూజీ లోకబాంధవుడు. భగవంతునిచే శాంతి సాధనకై పంపబడిన దూత. మహా పురుషుల లక్షణాలుండడంవల్ల మహాత్ముడయ్యాడు. మన బాపూ మనకిలేడు. అయ్యో ఎంతటి దారుణమైనమాట వినవలసివచ్చింది. శత్రువునైనా కఠినంగా మాట్లాడవద్దనేవాడు. కొట్టినవారిని కొట్టవద్దు. తిట్టినవారిని తిట్టవద్దు. అన్నీ పడి వూరుకుంటే వారికే వస్తుంది పశ్చాత్తాపం. అదే వారికి ఆయుధంలాగ పనిచేస్తుందనిచెప్పే అహింసామూర్తి హింసించబడి మరణించాడు. భారతమాత పుత్రరత్నాన్ని గోల్పోయింది. భారతనాయకమణి అదృశ్యమైంది. ధృవతార రాలిపోయినట్లుంది. ప్రపంచమంతా అంధకార బంధురమైపోయింది. ఈ దుఃఖంయెలా భరించడం? అంటూ వాపోయాడు. వారం రోజులు అన్నం, నీరు ముట్టలేదు." రామనాథం కంఠం రుద్ధమైంది.

మహాత్ముని మరణవార్త సందర్భంరాగానే వర్మ మనస్సు అదోకలాగ అయిపోయింది. "ఆయన మరణానికి దేశదేశాలు దుఃఖించాయి. ఇక భారతీయులమాట చెప్పాలా? జాతిపిత, యుగపురుషుడు

అయిన మహాత్ముని గోల్పోయినప్పుడు ప్రతి భారతీయుని హృదయంలోను అగ్ని పర్వతపు భుగభుగలే, అబ్బా! ఆ నాడు రోజల్లా సైరన్ కూతలు రోదన ధ్వనిలాగ కూస్తుంటే ఆ బాల గోపాలానికీ గుండె తరుక్కుపోయింది" అంటూ నిట్టూర్పు విడిచాడు.

"ఆ సమయంలో మన దేశ నాయకులు చాలా నిగ్రహంతో తెలివిగా వ్యవహరించారు. మతోద్రేకాలు పెచ్చుపెరగకుండా వుండేందుకు "ఒక పిచ్చివాడు చంపాడు" అన్నారు. అంతేకాని ఎవరు చంపిందీ తెలియనీయలేదు" అన్నాడు రావు.

"అన్ని వేగాలకంటె మనోవేగం గొప్పది అంటారిందుకే. రంగయ్యతాత గురించి చెబుతుంటే దాని మీద యెన్ని కబుర్లు వచ్చాయో చూశారా! జాతీయగీతంయొక్క ప్రాముఖ్యత యేమిటో, పౌర శిక్షణ అంటే యేమిటో ఆ వూరి జనానికేకాదు ఆ చుట్టుపట్ల వాళ్ళకికూడా నేర్పింది రంగయ్యతాతే! ఆ శిక్షణే ఒకప్పుడు వాళ్ళ ప్రాణాలు కాపాడింది" అన్నాడు రామనాథం.

"జాతీయగీతం ప్రాణాలెలా కాపాడింది. చిత్రంగా వుంది మీమాట" రావు, వర్మ ఒక్కమారే అడిగారు.

"చిత్రంగానే వుంటుంది. ఇలాంటి సంఘటన యెక్కడా జరిగినట్లు వినలేదుకూడాను.

ఆంధ్రరాష్ట్రం అవతరించుతున్న శుభదినం. రంగయ్యతాత సలహాపై ఊరంతా అలంకరించారు. ప్రతీయింటిమీద జండా యెగురవేశారు. ఆకాశ వీధిలో ఆ జండా లెగురుతుంటే నేత్రోత్సవంగావుంది. శ్రీరాములుగారి ఆత్మార్పణంతో వచ్చింది రాష్ట్రమని, ఆ నాడు రంగయ్యతాత వుపవాసం వున్నాడు. పిల్లలంతా అంధ్రరాష్ట్రం బాడ్జిలు ధరించి వుత్సాహంగా తిరుగుతున్నారు. సాయంత్రం నావ షికారుకు తీసుకొని వెళ్లమని రంగయ్యతాత నడిగారు. మొదట అంగీకరించకపోయినా వారి వుత్సాహంచూసి అంగీకరించకుండా వుండలేకపోయాడు చివరకి. మూడు నావలపై బయలుదేరారు. త్రోవలోకి తెచ్చుకున్న ఫలహారాలు తిన్నారు. తియ్యని గోదావరి నీరు తాగారు, హాయిగా రెండు గంటలు తిరిగారు. పౌర్ణమిముందు అవడంవల్ల వెన్నెలకూడా వచ్చింది. మహా ఆనందంగావుంది. ఎవరికి వచ్చిన పాటలు వారు పాడారు. కబుర్లు చెప్పుకున్నారు. ఇక రెండు ఫర్లాంగుల దూరంలోవున్నారు గట్టుచేరడానికి.

గాలి ప్రారంభమైంది. ఉన్నట్టుండి నావ వూగడం ప్రారంభించింది. గోదావరిలో అలలు బయలుదేరాయి. గాలి యెక్కువైంది. మూడు పడవలలోవున్న పిల్లలూ ఒక్కమారు లేచి నిలబడ్డారు ఖంగారుపడుతూ. ఆ ఖంగారులో ఒక్కచోటికి చేరబోతున్నారు. అలాచేరతే పడవ తెటికిలబడే ప్రమాదంవుంది. ఆ సంగతి పాపం ఆ చిన్నవాళ్ళకి తెలియదు. భయపడిపోతున్నారు. "జనగణమన అధినాయక జయహే" జాతీయగీతం వినబడింది. ఎక్కడివాళ్ళక్కడ నిలబడ్డారు పరిగెట్టడంమాని. కళ్లు మూసుకొని, తలవంచుకుని నిలబడ్డారు పాట పూర్తి అయ్యేవరకు. రంగయ్యతాత పాడాడు పాట! ఏపనిలోవున్నా సరే జాతీయగీతం వినబడగానే ఆ పనివదిలేసి శాంతంగా నిలబడమని రంగయ్యతాత బోధించాడు. ఆ ప్రమాదకరమైన పరిస్థితిలో జాతీయ గీతంపాడి వాళ్ళంతా ఒక్కచోటికి రాకుండా చేశాడు. అంతలో పడవలు గట్టుజేరాయి. ప్రమాదం తప్పించినందుకు జోహారు లర్పించారు రంగయ్యతాతకి" అన్నాడు రామనాథం.

"దేశభక్తితోపాటు సమయస్ఫూర్తికూడావుంది మీ రంగయ్యతాతకి. విషయం తెలిసినా సమయానికి జ్ఞాపకంరాదు. గురువుకుతగ్గ శిష్యులే ఆ పిల్లలు కూడా" ఆశ్చర్యంతో అన్నాడు వర్మ.

"రంగయ్యతాతా, నువ్వు దేశభక్తుడివి, త్యాగమూర్తివి. ప్రజాసేవ చేశావు. ప్రభుత్వం నిన్ను గుర్తించలేకపోయింది. నీకేమీ ఉపకారం చెయ్యలేదు అంటే అంటాడు "జననీ జన్మభూమిశ్చ స్వర్గాద పిగరీయసి" అన్నారు. ఎవరి మాతృదేశం అంటే వారికి అభిమానం వుండడం గొప్పా?" అని.

తను త్యాగమూర్తి కాదట. ఎందరో త్యాగులున్నారట. ప్రభుత్వం ఉపకారం చెయ్యవలసినంత పని తాను చేయలేదుట. ప్రతీవారు ప్రభుత్వం యేమి చెయ్యలేదనడం ఒకటి బాగా అలవాటయింది. వాళ్లేం దేవతలా? మనవంటివారేకదా? తెల్లవారితే యెన్నెన్నో సమస్యలు యెదుర్కొంటూంటే వాటితో సతమతమౌతుంటారు. అవన్నీ చాలక మనకేవో చెయ్యలేదంటే యెంతమందికని వ్యక్తిగతంగా చెయ్యగలరు? దేశమంటే మట్టికాదు, మనుష్యులే - చేతనైనంతవరకు మానవసేవ చెయ్యడం ప్రతివారి కర్తవ్యం. మానవసేవే మాధవసేవ. అంతా ఆ విధంగావుంటే ప్రజలకీ, ప్రభుత్వాలకేకాక ప్రపంచానికే తీరని సమస్యలుండవు అంటాడు. నిర్మాణ కార్యక్రమం అంటూ యీనాడు పెద్దలు చెప్పే కార్యక్రమాన్ని యేనాటినుండో అమలుపరుస్తున్నాడు. నేను భారతమాత బిడ్డనని సగర్వంగా చెప్పుకుంటాడు. మతతత్వాలకు, పార్టీరాజకీయాలకు అతీతుడు.

మా రంగయ్యతాత ఇంకా యెన్నెన్నో గొప్ప పనులు చేశాడు. కొన్ని మాత్రమే మీకు చెప్పాను. ఎవరు గుర్తించకపోయినా ఆయనకు లోటులేదు. సరిహద్దు గాంధి, రెడ్‌షర్టు దళ నాయకుడు అయిన ఖాన్ అబ్దుల్ గఫర్‌ఖాన్‌వలె యెప్పుడూ మానవాభ్యుదయానికి తోడ్పడడమే రంగయ్యతాత ఆశయం. అదే ఆయన జీవిత పరమావధి. ఇంకా ఇలాంటి అజ్ఞాతసేవకు లెందరున్నారో!" రామనాథం అన్నాడు.

"ఏ పదవులను అపేక్షించక నిరంతరం ప్రజల మధ్యనుండి, వారిలో తానొకడై, వారి కష్టసుఖాలలో పాలుపంచుకుంటూవుండే రంగయ్యతాతవంటి దేశసేవకులను గుర్తించి తగిన రీతిని సత్కరించాలి" రంగయ్యతాత తనకేదో అప్పుడిలాగ అనిపించి అన్నాడు రావు.

"తన అర్థం, ప్రాణం ప్రజకు వినియోగించాడు. తన సుఖం చూచుకోలేదు యెప్పుడూ. పరోపకారార్థమిదం శరీర"మను తరగతికి చెందినవాడు రంగయ్యతాత. నేడు బీదస్థితివచ్చినా ఆ అడగడంలోనూ ఒక విశిష్టతవుంది. తనకు కావలసినదానికన్న యెక్కువ అడగడు. అదైనా యెరుగున్నవాళ్లైతేనే. ఈ వూళ్లో చాలాకాలంగావున్న రెండు హోటళ్లున్నై. ఎప్పుడైనా అక్కడికే వెడతాడు. వాళ్లు ఈయన్ను చూడగానే భోజనం పెడతారు. ఆయన అడగనే అక్కర్లేదు. మా రంగయ్యతాత యిప్పుడు కూడా దానం చేస్తూనే వుంటాడు.

మా వూళ్లోని యిప్పటి కుర్రాళ్లు కథలుగా చెప్పుకుంటారు ఈయన విషయాలు. రంగయ్యతాత వృద్ధుడైపోయాడు. వెనకటి హుషారులేదు. అందుచేత వారికి యితనితో సంబంధంలేదు. రామాయణకథాగాయకులైన కుశలవులు శ్రీరాముని చూచినప్పుడు రామాయణకథాపురుషుడని భయ, సంభ్రమాశ్చర్యాలతో చూసినట్లు చూస్తారు రంగయ్యతాత యీయనేనని" అంటూ రామనాథం రంగయ్యతాత కథ ముగించాడు.

హోటల్‌లోని గడియారం యెనిమిది కొట్టడంతో వారు ముగ్గురూ ప్రకృతావస్థను పొందారు.

"గొప్పవ్యక్తి" అని రావు అంటూండగా ముగ్గురూ లేచారు.